R. REPUBLIC HINDUSTAN

# రిపబ్లిక్ హిందుస్థాన్

తెలుగు దినపత్రిక

సంపుటి : 1 ఆదిలాబాద్ సంచిక : 305 శుక్రవారం 8 నవంబర్ 2024 పేజీలు : 4 వెల : 5/-

COMBO OFFER
Two Websites at Just ₹9900/-
• Responsive website
• CMS E-PAPER + MAIN WEBSITE
• AI AUTOMATIC CONTENT WRITER (NEWS + OTHERS CONTENT)
• EARN MONEY WITH GOOGLE ADSENSE
at Just ₹9900/-
8985614333
Powered by: WEB39.IN

## నాణ్యమైన విద్య అందించడమే

# ప్రభుత్వ లక్ష్యం

- థాంక్యూ సీఎం సార్..గురుకుల విద్యార్థులతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ..
- డైట్ ఛార్జీలు పెంచినందుకు విద్యార్థులు సీఎంకు కృతజ్ఞతలు
- గురుకులాల్లో పరిస్థితులను సీఎం విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.
- అందరికి విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది
- చదువుతో పాటు స్కిల్స్ ఉంటేనే ఉద్యోగాలు



హైదరాబాద్

సచివాలయంలో ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గానికి చెందిన విద్యార్థులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం విద్యార్థులతో మాట్లాడుతూ. అందరికి విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం. చదువుతో పాటు స్కిల్స్ ఉంటేనే ఉద్యోగాలు లభిస్తాయి. అని విద్యార్థులకు సీఎం సూచించారు. డైట్ ఛార్జీలు పెంచినందుకు విద్యార్థులు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. గురుకులాల్లో పరిస్థితులను సీఎం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. - మిగతా3లో



## వాటిపై ఫోకస్ పెట్టిన హైడ్రా

- ప్రత్యేక టీమ్‌తో బెంగళూరుకు కమిషనర్ రంగనాథ్
- బెంగళూరులో హైడ్రా బృందం పర్యటన
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ నేతృత్వంలో అక్కడి చెరువులపై అధ్యయనం
- ఎలక్ట్రానిక్ సిటీ సమీపంలో చెరువుల సందర్శన
- నివాసాల మధ్య చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణ

హైదరాబాద్

చెరువుల పునరుద్దరణ, విపత్తుల నిర్వహణపై అధ్యయనానికి హైడ్రా అధికారుల బృందం బెంగళూరు బాట పట్టింది. బుధవారం హైడ్రా అధికారులు బెంగళూరు వెళ్లగా, ఇవాళ కమిషనర్ రంగనాథ్ అక్కడికి చేరుకున్నారు. రెండు రోజుల పాటు బెంగళూరులోనే పర్యటించి అక్కడి చెరువుల పునరుద్దరణపై సీనియర్ శాస్త్రవేత్తలు, పర్యావరణ ప్రముఖులతో సమావేశం కానున్నారు. యెల్లంకలో - మిగతా3లో

## 'ఒకే ఒక్కడు ఎనుముల రేవంత్ రెడ్డి'

## పుస్తకాన్ని ఆవిష్కరించిన టీపీసీసీ చీఫ్

- రేవంత్ రెడ్డి విలక్షణమైన నాయకుడన్న మహేశ్ కుమార్ గౌడ్
- రాజకీయాల్లో డైనమిక్ లీడర్‌గా ఎదిగిన వ్యక్తి అని ప్రశంస
- రేవంత్ సుదీర్ఘ కాలం రాజకీయాల్లో ఉండాలని ఆకాంక్ష



హైదరాబాద్

హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో 'ఒకే ఒక్కడు ఎనుముల రేవంత్ రెడ్డి' పుస్తకాన్ని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని ప్రముఖ రచయిత వేణుగోపాల్ రెడ్డి రాశారు. ఆవిష్కరణ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి విలక్షణమైన నాయకుడు అన్నారు. చిన్న వయస్సులోనే రాజకీయాల్లో డైనమిక్ లీడర్‌గా ఎదిగిన వ్యక్తి అని కొనియాడారు. ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి నిర్బంధ పాలన చేస్తున్న కేసీఆర్‌పై - మిగతా3లో

## ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడిన మోదీ

- భారత్, అమెరికా మధ్య ఉన్న వాణిజ్య బంధాన్ని గుర్తు చేసిన మోదీ
- 2019 సెప్టెంబర్‌లో హూస్టన్‌లో జరిగిన హౌడీ మోడీ ఈవెంట్‌ను కూడా ప్రధాని మోదీ గుర్తు చేశారు



## కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలు దివాలా తీశాయి

- కాంగ్రెస్ పాలనపై 11 నెలల్లోనే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తోందని వ్యాఖ్య
- బీజేపీకి సంస్థాగత ఎన్నికల వ్యవస్థనే ఊపిరి అన్న కిషన్ రెడ్డి
- ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని పిలుపు



## కేటీఆర్ చుట్టూ బిగుసుకుంటున్న

## ఫార్ములా ఈ రేసు స్కాం

- ఫార్ములా ఈ-కార్ రేసింగ్ వ్యవహారంలో భారీ స్కామ్ జరిగిందని అనుమానిస్తున్న కేసులో ఏసీబీ దూకుడుగా దర్యాప్తు
- విచారణలో వేగం పుంజుకున్న ఫార్ములా ఈ రేసు కేసు
- కేటీఆర్‌పై ఎఫ్ఐఆర్ నమోదుకు గవర్నర్ అనుమతి కోసం రాష్ట్ర ప్రభుత్వం లేఖ
- రాష్ట్రంలో జరిగిన పలు స్కాములపై ప్రభుత్వం విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే.



హైదరాబాద్

ఫార్ములా-ఈ కారు రేస్ వ్యవహారంలో ఒప్పందం కుదరడానికి ముందే నిధులు చెల్లించడం, అందులోనూ నిబంధనలకు విరుద్ధంగా విదేశీ కరెన్సీ రూపంలో ఇవ్వడంపై విచారణ వేగవంతం అయినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై విచారణ జరపాలని ఏసీబీకి పురపాలక, పట్టణాభివృద్ధి సంస్థ గత వారమే లేఖ రాసింది. అయితే ఇక్కడే ఒక చిక్కుముడి వచ్చింది. బాధ్యులైన వారిపై కేసు నమోదు చేసి విచారణ జరపాలంటే వారి స్థాయి ప్రకారం ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో అప్పటి పురపాలక శాఖ మంత్రి, ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న కేటీఆర్‌పై ఎఫ్ఐఆర్ నమోదుకు గవర్నర్‌కు అనుమతి కోసం లేఖ రాసినట్లు సమాచారం. దీనిపై గవర్నర్ సైతం న్యాయ సలహా కోరినట్లు తెలుస్తోంది. ఫార్ములా ఈ-కార్ రేసింగ్ వ్యవహారంలో భారీ స్కామ్ జరిగిందని అనుమానిస్తున్న - మిగతా3లో




## కేంద్రం కీలక నిర్ణయం

- పంట వ్యర్థాలు తగలబెట్టే రైతులకు రెట్టింపు జరిమానా
- రోజురోజుకూ తీవ్రమవుతోన్న వాయు కాలుష్యం
- పంట వ్యర్థాలను దహనం చేసే రైతులకు రెట్టింపు జరిమానా విధించేలా నిబంధనలు
- ఏక్యూఐ లెవల్స్ రాజధాని ప్రాంతంలో 400కుపైనే నమోదు

## ముందుకు సాగని

# రైతు కమిషన్

- రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం
- జీవో నెంబర్ 36తో దీన్ని ఏర్పాటు చేసి, కిసాన్ కాంగ్రెస్ నేత కోదండ రెడ్డిని చైర్మన్‌గా నియమించింది.
- విద్యా కమిషన్‌కు వసతులు ఆగమేఘాలపై ఏర్పాటు కాగా,
- రైతు కమిషన్‌పై మాత్రం అశ్రద్ధ వహిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.




హైదరాబాద్

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. జీవో నెంబర్ 36తో దీన్ని ఏర్పాటు చేసి, కిసాన్ కాంగ్రెస్ నేత కోదండ రెడ్డిని చైర్మన్‌గా నియమించింది. భూ చట్టాల నిపుణుడు సునీల్‌తో సహా మరో ఆరుగురు సభ్యులుగా ఈ కమిషన్ ముందుకెళ్తోంది. మొదటి సమావేశం బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో జరిగింది. అయితే, కమిషన్‌కు సంబంధించి అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. విద్యా కమిషన్‌కు వసతులు ఆగమేఘాలపై ఏర్పాటు కాగా, రైతు కమిషన్‌పై - మిగతా3లో

## ఎట్టిపరిస్థితుల్లో అలా చేయకూడదు

- ప్రభుత్వ ఉద్యోగాలపై సుప్రీంకోర్టు కీలక తీర్పు!
- రిక్రూట్‌మెంట్ మధ్యలో రూల్స్ మార్చకూడదన్న న్యాయస్థానం
- ఈ మేరకు సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు అనుగుణంగా నిబంధనలు ఉండాలని సూచన



# డొనాల్డ్ ట్రంప్ జీతం నెలకు 3.3 కోట్ల రూపాయిల జీతం

**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన వ్యక్తికి అనేక ప్రయోజనాలు లభిస్తాయి. ఆ ప్రయోజనాలు అద్భుతంగా ఉంటాయి. అమెరికా అధ్యక్షుడు వైట్ హౌస్ లో నివాసం ఉంటారు. అక్కడ 24/7 పాటు సెక్యూరిటీ ఉంటుంది. ఈగ కూడా వాలనివ్వకుండా సెక్యూరిటీ సిబ్బంది చూసుకుంటారు.. అమెరికా అధ్యక్షుడికి వార్షిక వేతనంగా నాలుగు లక్షల డాలర్ల వేతనం లభిస్తుంది. భారతీయ కరెన్సీ ప్రకారం చూసుకుంటే అది 3.3 కోట్ల వరకు ఉంటుంది. ఆ మొత్తాన్ని ఇవ్వాలని 2001లో అమెరికా కాంగ్రెస్ నిర్ణయించింది. అప్పటినుంచి అమెరికా అధ్యక్షుడి వేతన విషయంలో ఎటువంటి మార్పు లేదు. ఇక అమెరికా అధ్యక్షునిగా పనిచేసి.. రిటైర్ అయిన వారికి ప్రయోజనాల రూపంలో ప్రతి ఏడాది రెండు లక్షల డాలర్లు లభిస్తాయి. ఇతర అలవెన్స్ ల కింద లక్ష డాలర్లు అందుతాయి. వేతనం మాత్రమే కాకుండా అధికారిక ఖర్చులకోసం, వ్యక్తిగత ఖర్చులకోసం జీతంతో పాటు 50 వేల డాలర్లు లభిస్తాయి. అయితే ఇవి పన్ను రహితంగా ఉంటాయి. ప్రయాణ ఖర్చులకు 1,00,000 డాలర్లు లభిస్తాయి. అధ్యక్షుడు వినోదం కోసం 19 వేల డాలర్లు అందుతాయి. ఈ ప్రకారం చూసుకుంటే అధ్యక్షుడికి ప్రతి సంవత్సరం 5.69 లక్షల డాలర్లు లభిస్తాయి. కొత్త అధ్యక్షుడు వైట్ హౌస్ లో అడుగు పెట్టడానికి ముందు దానిని అందంగా అలంకరిస్తారు. దీనికోసం లక్ష డాలర్లు వెచ్చిస్తారుఇక అమెరికా అధ్యక్షుడు నివాసముండే వైట్ హౌస్ ను 1800 సంవత్సరంలో నిర్మించారు. ప్రస్తుతం ఈ భవన సముదాయం



55 వేల చదరపు అడుగుల విస్తీర్ణాన్ని కలిగి ఉంది. ఇందులో 132 గదులు ఉన్నాయి. 35 బాత్ రూం లు ఉన్నాయి. ఇందులో టెన్నిస్ కోర్టు ప్రత్యేకంగా ఉంటుంది. జాగింగ్ ట్రాక్ అధునాతనంగా ఉంటుంది. మూవీ థియేటర్, ఈతకొలను వంటి సదుపాయాలు కూడా ఉంటాయి. అధ్యక్షుడి కోసం ఇక్కడ నిత్యం ఐదుగురు వంటవాళ్లు పనిచేస్తుంటారు. అధ్యక్షుడు కోరుకున్న విధంగా వంటలు వండి సర్వ్ చేస్తుంటారు.వైట్ హౌస్ మాత్రమే కాకుండా అమెరికా అధ్యక్షుడికి బ్లయిర్ హౌస్ అనే గెస్ట్ హౌస్ కూడా ఉంటుంది. ఇది వైట్ హౌస్ కంటే చాలా పెద్దది. 70 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉంటుంది. ఇందులో 119 గదులు ఉంటాయి. గెస్ట్ ల కోసం 20 పడక గదిలో ఉంటాయి. 35 స్నానాల గదులు ఉంటాయి. ఇందులో నాలుగు డైనింగ్ హాల్స్, జిమ్, సెలూన్ వంటివి కూడా ప్రత్యేకంగా ఉంటాయి.అమెరికా అధ్యక్షుడు కోసం క్యాంప్ డేవిడ్ పేరుతో హిల్ గెస్ట్ హౌస్ కూడా ఉంటుంది. ఇది మేరీ ల్యాండ్ రాష్ట్రంలో 128 ఎకరాలలో విస్తరించి ఉంది. హిల్ గెస్ట్ హౌస్ ను మొదట రుజ్ వెల్ట్ ఉపయోగించాడు. దీనిని ఎక్కువగా దౌత్యపరమైన విషయాలు చర్చించడానికి ఉపయోగిస్తారు.. అప్పట్లో ఈ కేంద్రం వేదికగానే ఈజిప్టు ? ఇజ్రాయిల్ దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. దీనిని క్యాంపు డేవిడ్ ఒప్పందం అని కూడా పిలుస్తారు.అమెరికా అధ్యక్షుడు ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో ప్రయాణిస్తారు. ఇందులో అనేక సౌకర్యాలు ఉంటాయి. ఈ విమానం గాలిలో ఉండగానే ఇంధనం నింపుకుంటుంది. ఇక మెరైన్ వన్ అనే హెలికాప్టర్ అమెరికా అధ్యక్షుడికి సేవలు అందిస్తుంది. ఇది గంటకు 241 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. బాంబు పేలుళ్లను కూడా ఇది తట్టుకుంటుంది. దీనికి మూడు ఇంజిన్లు ఉంటాయి. ఒక్కటి విఫలమైనా మిగతా రెండు ఇంజన్లతో ఆ హెలికాప్టర్ నడుస్తుంది. అయితే ఇలాంటి హెలికాప్టర్లు ఐదు ఉన్నాయి. శత్రువుల నుంచి అధ్యక్షుడిని కాపాడేందుకు ఇలా హెలికాప్టర్లను ఉపయోగిస్తున్నారు.ఇక అమెరికా అధ్యక్షుడు ప్రయాణించే కారు పేరు బీస్ట్. ఇది అద్భుతమైన ఫీచర్లను కలిగి ఉంటుంది. అత్యంత భారీ భద్రత ప్రమాణాలతో దీనిని రూపొందించారు. అమెరికా అధ్యక్షుడు తను వెళ్లిన ప్రతి దేశానికీ.. ఈ కారు పరుగులు పెడుతుంటుంది. అమెరికా అధ్యక్షుడు మాత్రమే కాదు.. వారి కుటుంబ సభ్యులకు ఈ కారులో 24/7 అత్యంత రహస్య భద్రత ఉంటుంది.

## బెంగళూరులో మెరిసిన బ్రిటన్ మాజీ ప్రధాని.. భార్యతో కలిసి కాఫీషాప్‌లో సందడి



బ్రిటన్ మాజీ ప్రధాని, భారత సంతతికి చెందిన రిషి సునాక్ బెంగళూరులో మెరిశారు. తన భార్య అక్షతా మూర్తి తో కలిసి ఓ కాఫీ షాప్‌లో సందడి చేశారు. స్థానికులతో ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ ఆకట్టుకున్నారు. రిషి సునాక్, ఆయన భార్య అక్షతా మూర్తి ఇటీవలే బెంగళూరులోని థర్డ్ వేవ్ కాఫీ షాప్‌లో కాఫీ డేట్‌ను ఆస్వాదించారు. ఇద్దరూ టేబుల్ వద్ద కాఫీని ఎంజాయ్ చేస్తూ సరదాగా కబుర్లు చెప్పుకుంటూ కనిపించారు. ఆ సమయంలో కాఫీ షాప్‌కు వెళ్లిన స్థానికులు రిషి సునాక్ జంటను చూసి థ్రిల్ అయ్యారు. వారితో ఫొటోలు, సెల్ఫీలు దిగేందుకు ఎగబడ్డారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. కాగా, రిషి సునాక్ 2022 నుంచి 2024 వరకు యూకే ప్రధాన మంత్రిగా పనిచేసిన విషయం తెలిసిందే. ఇటీవలే జరిగిన ఎన్నికల్లో రిషి సునాక్ పార్టీ ఓటమి చవి చూసింది. ఇన్ఫోసిస్ సంస్థ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి సుధామూర్తి కుటుంబం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎంతో విజయవంతంగా ఓ సాఫ్ట్‌వేర్ సంస్థను నడుపుతున్నప్పటికీ సాదాసీదా జీవితాన్ని గడుపుతుంటారు. వీరి కుమార్తే అక్షతా మూర్తి. అక్షత.. రిషి సునాక్‌కు ప్రేమ వివాహం చేసుకుంది. రిషి యూకే ప్రధానిగా ఉన్న సమయంలో అక్షతా మూర్తి బెంగళూరు వీధుల్లో తన తండ్రితో కలిసి షాపింగ్ చేసిన విషయం తెలిసిందే. తండ్రి నారాయణమూర్తి, తల్లి సుధామూర్తి, ఇద్దరు కుమార్తెలు అనౌష్క, కృష్ణతో కలిసి నగరంలోని రాఘవేంద్ర మఠాన్ని సందర్శించారు. అయితే, ఆ టైంలో ఎలాంటి భద్రత లేకుండా సాధారణ పౌరుల్లా అక్కడ మొత్తం కలియతిరగడం అప్పట్లో హాట్‌టాపిక్‌గా మారింది. అంతేకాదు పలు సందర్భాల్లోనూ వీరు సిలికాన్ సిటీలో సందడి చేశారు.

## ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడిన మోదీ

**న్యూఢిల్లీ:** అమెరికా 47వ దేశాధ్యక్షుడిగా ఎన్నికైన రిపబ్లికన్ నేత డోనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్‌లో సంభాషించారు. భారత్, అమెరికా మధ్య ఉన్న వాణిజ్య బంధాన్ని గుర్తు చేశారు. ట్రంప్ తొలి దశ పాలన సమయంలో.. ఆయనకు మోదీ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి. ఆ జ్ఞాపకాలను మోదీ



నెమరేసుకున్నారు. 2019 సెప్టెంబర్‌లో హ్యూస్టన్‌లో జరిగిన హౌడీ మోడీ ఈవెంట్‌ను కూడా ప్రధాని మోదీ గుర్తు చేశారు. 2020 ఫిబ్రవరిలో నమస్తే ట్రంప్ పేరుతో అహ్మదాబాద్‌లో కార్యక్రమాన్ని నిర్వహించిన విషయం తెలిసిందే. అమెరికా, భారత్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం గురించి మాట్లాడారు. టెక్నాలజీ, రక్షణ, ఎనర్జీ, అంతరిక్ష రంగాలతో పాటు ఇతర రంగాల్లోనూ సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నట్లు ఇద్దరూ పేర్కొన్నారు.

# భారత్‌కు బాసటగా అగ్రరాజ్యం

**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్ష ఎన్నికలు ముగిశాయి. హోరాహోరిగా జరిగిన ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ తన సమీప ప్రత్యర్థి, డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలపై విజయం సాధించారు. అధ్యక్షుడిగా విజయం సాధించిన నేపథ్యంలో త్వరలో ట్రంప్ ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ గెలిచిన తర్వాత.. ప్రపంచం మొత్తం అతడి పరిపాలన ఎలా ఉండబోతుందో అంచనా వేస్తోంది. ఈ క్రమంలో భారత మీడియా కూడా ట్రంప్ పరిపాలించే విధానంపై విశ్లేషణ చేసింది. ముఖ్యంగా అమెరికా ? భారత సంబంధాలు ఎలా ఉంటాయోనని ఒక అంచనా వేసింది. ఎన్నికల ప్రచారం సమయంలో " అమెరికాకు సంబంధించి ఫారిన్ అఫైర్స్ ను పునరుద్ధరిస్తామని" ట్రంప్ పదే పదే ప్రకటించారు. అమెరికా అధ్యక్షుడిగా తొలిసారి ఎన్నికైన తర్వాత.. తమ దేశానికి సంబంధించిన ప్రయోజనాల విషయంలో ట్రంప్ విశేషమైన ప్రాధాన్యం ఇచ్చారు. ముఖ్యంగా ఇరాన్ అణు ఒప్పందం, పారిస్ వాతావరణ ఒప్పందం అందులో ముఖ్యమైనవి. ఇక కీలకమైన అంతర్జాతీయ ఒప్పందాలను కూడా ట్రంప్ వివిధ దేశాలతో కుదుర్చుకున్నారు. కొన్ని దేశాలతో స్నేహపూర్వకంగా మెలిగారు. మరికొన్ని దేశాలతో యుద్ధ వాతావరణం కొనసాగించారు. అమెరికా ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్న ఏ విధానాన్ని అయినా సరే ట్రంప్ తోసిపుచ్చారు. ఇప్పుడు మళ్లీ అమెరికాను అగ్ర పథం లో నిలబెడదామని ట్రంప్ ఎన్నికల సమయంలో పదేపదే



వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో ట్రంప్ మరొకసారి అమెరికా అధ్యక్షుడైన తర్వాత.. భారతదేశంలో సహా ఇతర దేశాలతో అమెరికా కుదుర్చుకున్న ఒప్పందాలపై ప్రభావం చూపించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. దౌత్యం, వలసలు, వాణిజ్యం, సైనిక సహకారం వంటివి ప్రధాన పాత్ర పోషిస్తాయని సమాచారం.భారత్ అమెరికా మధ్య వాణిజ్య సంబంధాలు ఎన్నో సంవత్సరాల నుంచి సాగుతున్నాయి. ఈ క్రమంలో ఇటీవల అమెరికా నుంచి ఇతర దేశాలకు ఎగుమతి చేసే ఉత్పత్తులపై అత్యధిక సుంకాలను విధిస్తున్నారని ట్రంప్ మండిపడ్డారు. తాము కూడా ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై అదే విధంగా వసూలు చేస్తామని హెచ్చరించారు. అయితే ఈ జాబితాలో భారత్ కు మినహాయింపు లభించే అవకాశం ఉండకపోవచ్చు.. భారత్ గొప్ప దేశమని, మిత్ర దేశమని, మోడీ తనకు మంచి మిత్రుడని, గొప్ప నాయకుడని ట్రంప్ వ్యాఖ్యానించారు. అదే సమయంలో పన్నుల విషయాన్ని ప్రస్తావించారు. ఈ ప్రకారం చేసుకుంటే ట్రంప్ ఎలా వ్యవహరిస్తారు అనే విషయాన్ని ప్రముఖంగా ప్రస్తావించాల్సిన అవసరం లేదు.మన దేశం నుంచి అమెరికాకు ఉద్యోగాల నిమిత్తం అనేకమంది వెళుతుంటారు. హెచ్ -1 బీ వీసాల మీదుగా వారు అమెరికాకు వెళ్తుంటారు. మన దేశానికి చెందిన ఐటీ కంపెనీలు ఇలా అమెరికాకు పంపిస్తుంటాయి. ఈ క్రమంలో ఈ విధానాన్ని ట్రంప్ తీవ్రంగా వ్యతిరేకించారు. అంతేకాదు ఆయన అధ్యక్షుడిగా ఉన్నప్పుడే అమెరికా జీతాలతో సమానంగానే హెచ్ ? 1 బీ వీసా దారులకు ఇవ్వాలని ప్రతిపాదన వచ్చింది. అమెరికా భారత్ మధ్య సైనిక ఒప్పందాలు ఎప్పటినుంచో ఉన్నాయి. బైడన్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, అమెరికాకు చెందిన జనరల్ ఎలక్ట్రిక్ ఏరోస్పేస్ కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఇవే కాకుండా క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీ ఒప్పందం కూడా రెండు దేశాల మధ్య జరిగింది. అమెరికా అధ్యక్షుడిగా ఎవరున్నప్పటికీ పసిఫిక్ ప్రాంతంలో చైనా ను నిలువరించడం ప్రధాన లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ఈ ప్రకారం చూసుకుంటే రెండు దేశాల మధ్య సైనిక సహకారం కొనసాగే అవకాశం కనిపిస్తోంది. రెండు దేశాల ఉమ్మడి లక్ష్యానికి క్వాడ్ కూటమి కూడా సహకరించే అవకాశం కనిపిస్తోంది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అనేక సందర్భాల్లో తన వాణి వినిపించిన ట్రంప్.. పాకిస్తాన్ తో చేస్తున్న పోరాటంలో భారత్ కు సహకరించవచ్చని తెలుస్తోంది.

## ఎట్టిపరిస్థితుల్లో అలా చేయకూడదు

ప్రభుత్వ ఉద్యోగ నియామక ప్రక్రియ నిబంధనలకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పునిచ్చింది. రిక్రూట్‌మెంట్ మధ్యలో రూల్స్ మార్చకూడదని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. ఈ మేరకు సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం గురువారం ఉదయం కీలక



తీర్పు వెల్లడించింది. ఉద్యోగ నియామక ప్రక్రియ నిబంధనలు ఏకపక్షంగా ఉండకూడదని కోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగంలో పేర్కొన్న ఆర్టికల్ 14కు అనుగుణంగా ఉండాలని తెలిపింది. వివక్షకు తావులేకుండా ఉండాలని పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగ నియామక ప్రక్రియలో పారదర్శకత తప్పనిసరి అని సూచించింది. ఇక రిక్రూట్‌మెంట్ మధ్యలో నిబంధనలను మారిస్తే అభ్యర్థులు గందరగోళానికి లోనవుతారని వివరించింది. అందుకే ఉద్యోగ నియామక ప్రక్రియ ప్రారంభానికి ముందు ఒకసారి నిర్ణయించిన రూల్స్‌ను ఎట్టిపరిస్థితుల్లో మధ్యలో మార్చకూడదని స్పష్టం చేసింది.

## జాకీల సాయంతో లేపిన అమ్మవారి ఆలయం..



**చెన్నై:** పొన్నేరి సమీపం తిరేవేంగిడపురం గ్రామంలో కృష్ణన్ మారియమ్మన్ ఆలయం ఉంది. ఈ ఆలయంలో వినాయకుడు, ఆంజనేయుడు, దుర్గ, షణ్ముగ, కౌమారి, వైష్ణవి, మహేశ్వరి తదితర దేవతామూర్తులకు ప్రత్యేక సన్నిధులు నిర్మించారు. ఈ ఆలయంలో ప్రతి శుక్రవారం జరిగే పూజలకు భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. ఆలయం సమీపంలోని రోడ్డును పునరుద్ధరించే ప్రతిసారి రోడ్డు ఎత్తు పెరుగుతోంది. దీంతో, ఆలయం రోడ్డు కంటే కిందకు వెళ్లింది. ప్రస్తుతం పొన్నేరి పరిసర ప్రాంతాల్లో జాకీలతో సాయంతో 'లిఫ్టింగ్' విధానంలో భవనాల ఎత్తు పెంచే పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో, ఈ లిఫ్టింగ్ విధానంలో ఆలయం ఎత్తు పెంచాలని నిర్వాహకులు నిర్ణయించారు. ఓ సంస్థ సాయం తో జాకీలు ఏర్పాటుచేసి క్రమక్రమంగా లిఫ్టింట్ చేశారు. 20 రోజుల లిఫ్టింగ్‌లో ఆలయం మూడడుగుల ఎత్తు లేపారు. మరో రెండు నెలలో ఆలయంలో జీర్ణోద్ధరణ చేపట్టి కుంభాభిషేకం నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు ఆర్ఎన్ బాలాజి సర్కార్ తెలిపారు.

# సీఐఏ చీఫ్‌గా ఇండియన్‌కు ఛాన్స్?

న్యూయార్క్: సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ చీఫ్‌గా కశ్యప్ పటేల్‌కు అవకాశం దక్కనున్నది. అమెరికా కొత్త అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్.. భారతీయ సంతతికి వ్యక్తికి ఆ కీలక పదవిని అప్పగించే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ట్రంప్ కోసం ఏపని అయినా చేసేందుకు కశ్యప్ సిద్ధంగా ఉన్నారు. అయితే కశ్యప్ పటేల్‌కు గుజరాతీ మూలాలు ఉన్నాయి. ఈస్ట్ ఆఫ్రికాలో ఆయన పేరెంట్స్ పెరిగారు. 1970 దశకంలో ఆయన తండ్రి ఉగాండా నుంచి వలస వచ్చారు. 1980లో న్యూయార్క్ గార్డెన్ సిటీలో ఆయన జన్మించారు. హిందువుగా ఆయన పెరిగారు. వర్ణ వివక్షకు వ్యతిరేకంగా ఆయన పోరాడారు. రిచ్‌మండ్ యూనివర్సిటీలో ఆయన గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. న్యూయార్క్‌లో లా డిగ్రీ చదివారు. యూకేలోని యూనివర్సిటీ కాలేజీ లండన్ ఫాకల్టీ ఆఫ్ లాస్ నుంచి ఇంటర్నేషనల్ లా సర్టిఫికేట్ పొందారు. రక్షణశాఖ మాజీ కార్యదర్శి క్రిస్టోఫర్ మిల్లర్ వద్ద పనిచేశారు. నేషనల్ సెక్యూర్టీ కౌన్సిల్‌లో కౌంటర్ టెర్రరిజం సీనియర్ డైరెక్టర్‌గా చేశారు. గతంలో డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వ సమయంలో.. ఐసిస్, ఆల్‌ఖయిదా కీలక నేతల హత్యలకు మిషన్ నడిపించారు. హౌజ్ కమిటీకి



చెందిన ఇంటెలిజెన్స్‌కు నేషనల్ సెక్యూర్టీ అడ్వైజర్‌గా చేశారు. 2016 ఎన్నికల్లో రష్యా ప్రమేయంపై విచారణాధికారిగా చేశారు. లాయర్‌గా అనేక కేసుల్ని వాదించారు. హత్యలు, నార్కో ట్రాఫికింగ్, ఆర్థిక నేరాల గురించి ఫెడరల్ కోర్టుల్లో వాదించారు. 2019లో ట్రంప్ టీంలో కశ్యప్ పటేల్ చేరినట్లు ఓ రిపోర్టు ద్వారా తేలింది. గత పాలన సమయంలో సీఏఐ డిప్యూటీ డైరెక్టర్‌గా కశ్యప్ పటేల్‌ను నియమించాలని ట్రంప్ ప్లాన్ వేసినట్లు తెలిసింది.

## కేంద్రం కీలక నిర్ణయం



దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకూ తీవ్రమవుతోంది. గత కొన్ని రోజులుగా ఢిల్లీ -ఎన్సీఆర్ ప్రాంతంలో గాలి నాణ్యత చాలా పేలవమైన స్థాయిలో నమోదవుతోంది. ఏక్యూఐ లెవల్స్ రాజధాని ప్రాంతంలో 400కుపైనే నమోదవుతోంది. పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హర్యానాల్లో రైతులు తమ పంట వ్యర్థాలను తగలబెడుతుండటంతో రాజధాని ప్రాంతంలో ఈ పరిస్థితి తలెత్తుతోంది. కాలుష్య నియంత్రణకు పాలకులు ఎన్ని చర్యలు చేపట్టినా ఫలితం ఉండటం లేదు. రోజురోజుకూ గాలి నాణ్యత క్షీణిస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. పంట వ్యర్థాలను దహనం చేసే రైతులకు రెట్టింపు జరిమానా విధించేలా నిబంధనలను సవరించింది. రూ.30 వేల వరకూ జరిమానాను పెంచింది. ఈ నిబంధనలు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపింది. కేంద్ర నిబంధనల ప్రకారం.. రెండు ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులకు రూ.5 వేల జరిమానా విధించనున్నారు. రెండు నుంచి ఐదు ఎకరాల మధ్య ఉన్న వారికి రూ.10 వేలు, ఐదెకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు రూ.30 వేలు జరిమానా విధించనున్నారు. కాగా, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం.. ఉదయం 9 గంటలకు ఢిల్లీలో గాలి నాణ్యత 367గా నమోదైంది. ఆనంద్ విహార్, జహంగీర్‌పురి, అశోక్ విహార్, బావన, ముంద్కల్, రోహిని, సోనియా విహార్, వివేక్ విహార్, వాజీపూర్.. ఈ తొమ్మిది ప్రాంతాల్లో గాలి నాణ్యత తీవ్రమైన కేటగిరీలో ఉందని కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది. మరోవైపు కాలుష్యం కారణంగా ఢిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఓ వైపు వాయు కాలుష్యంతో ఊపిరితీసుకోవడం ఇబ్బందికరంగా మారగా.. మరో వైపు నీటి కాలుష్యంతోనూ సతమతమవుతున్నారు. యయునా నదిలో కాలుష్య స్థాయి విపరీతంగా ఉన్నది.

## మరణశిక్షపై ఏఐ లాయర్‌కు ప్రశ్న వేసిన సీజేఐ చంద్రచూడ్

**న్యూఢిల్లీ:** చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ ఇవాళ ఢిల్లీలో నేషనల్ జుడిషియల్ మ్యూజియంను ప్రారంభించారు. ఆ సమయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు చెందిన లాయర్‌కు ఓ ప్రశ్న వేశారు. ఏఐ లాయర్‌ను ఆయన తన ప్రశ్నతో పరీక్షించారు. భారత్‌లో మరణశిక్ష రాజ్యాంబద్దమేనా అని ప్రశ్నించారు. ఆ ప్రశ్నకు కృత్రిమ మేధకు చెందిన లాయర్ సమాధానం ఇచ్చారు. అడ్వకేట్ టై కట్టుకుని, కంటి అద్దాలు ధరించిన ఆ ఏఐ లాయర్ మాట్లాడుతూ.. అవును, మరణశిక్ష భారత్‌లో రాజ్యాంగబద్ధమే అని పేర్కొన్నారు. చాలా అరుదైన కేసుల్లో మాత్రమే ఆ శిక్షను ఖరారు చేస్తారని, చాలా హేయమైన నేరాలకు సుప్రీంకోర్టు ఆ శిక్ష వేస్తుందన్నారు. ఏఐ లాయర్ ఇచ్చిన సమాధానంతో సీజే




చంద్రచూడ్ ఆశ్చర్యపోయారు. స్మైల్ ఇస్తూ ఆయన అక్కడ నుంచి కదిలారు. సోమవారం నుంచి కొత్త సీజేగా బాధ్యతలు స్వీకరించనున్న జస్టిస్ సంజీవ్ ఖన్నా కూడా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 'ఒకే ఒక్కడు ఎనుముల రేవంత్ రెడ్డి' పుస్తకాన్ని ఆవిష్కరించిన టీపీసీసీ చీఫ్

-మొదటిపేజీ తరువాయి

పోరాటం చేసిన వ్యక్తి రేవంత్ రెడ్డి అన్నారు. రేపు ఆయన పుట్టిన రోజు సందర్భంగా 'ఒకే ఒక్కడు...' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్నట్లు చెప్పారు. టీపీసీసీ తరఫున మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్యమంత్రికి ముందస్తుగా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పారు. రేవంత్ రెడ్డి నిండ నూరేళ్లు జీవించాలని... సుదీర్ఘ కాలం రాజకీయాల్లో ఉండాలని ఆకాంక్షించారు.

**పూరీ బీచ్ లో రేవంత్ రెడ్డి సైకత శిల్పం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఒడిశాలోని పూరీ సముద్ర తీరంలో రేవంత్ రెడ్డి సైకత శిల్పాన్ని వేసి ఫిషరీస్ కార్పోరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ తన అభిమానాన్ని చాటుకున్నారు.

**రేవంత్‌కు ఫ్యాన్స్ బిగ్ సర్‌ప్రైజ్.. జీవితంలో గుర్తుండిపోయేలా బర్త్‌డే కానుక**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న నేత. పదేళ్ల పాటు అధికారం కోల్పోయిన కాంగ్రెస్‌ను తిరిగి గద్దెనెక్కేలా చేశారు రేవంత్. టీపీసీసీ అధ్యక్షుడిగా ఉంటూ దిగువ స్థాయి శ్రేణులను కూడా కలుపుకుంటూ పోతూ కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పనిచేశారు. మొత్తానికి అనుకున్నది సాధించిన రేవంత్.. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో నడిపేందుకు కృషి చేస్తున్నారు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నారు.

సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రెండు రోజుల్లోనే మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలులోకి తీసుకువచ్చారు రేవంత్. ఇదిలా ఉండగా.. రేపు (శుక్రవారం) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుట్టినరోజు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అలాగే తెలంగాణ సీఎం పుట్టినరోజు సందర్భంగా ఆయనకు బిగ్ సర్‌ప్రైజ్ ఇవ్వాలని ఫ్యాన్స్ డిసైడ్ అయ్యారు.




దీంతో జీవితంలో ఆయనకు గుర్తుండుపోయేలా ఓ కానుకను ఇచ్చారు. సైకత శిల్పాలకు ఫేమస్ అయిన ఒడిశాలోని పూరి బీచ్‌లో రేవంత్ సైకత శిల్పాన్ని వేయించి.. ఆయనకు బర్త్‌డే కానుకను అందజేశారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డికి వచ్చిన ఓ స్పెషల్ కానుక మాత్రం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్.. రేవంత్ రెడ్డి పట్ల వెరైటీగా తన అభిమానాన్ని చాటుకున్నారు. సీఎంకు ఆయన ఇచ్చిన అపురూపమైన బహుమతి ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఇంతకీ సాయి కుమార్.. రేవంత్‌కు ఇచ్చిన బహుమతి ఏంటో ఇప్పుడు చూద్దాం. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఒరిస్సాలోని సముద్రతీరం పూరీ బీచ్‌లో సైకత శిల్పాన్ని ఆవిష్కరించి తన అభిమానాన్ని చాటుకున్నారు ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్. బీచ్‌లో ఇసుకతో రేవంత్ రెడ్డి చిత్రాపటాన్ని వేసి.. దానిపై హ్యాపీ బర్త్‌డే రేవంత్ అన్న .. తెలంగాణ సీఎం అంటూ రాశారు. బెస్ట్ విషెస్ ఫ్రమ్ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ అంటూ అందులో పేర్కొన్నారు.

దీనికి సంబంధించి ఎక్స్‌లో ఓ వీడియో పోస్టు అయ్యింది. "ప్రియతమ ముఖ్యమంత్రి, తెలంగాణ ప్రజా నేత రేవంత్ రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా ఒరిస్సాలోని సముద్ర తీరంలో పూరీ బీచ్‌లో సైకత శిల్పం ఆవిష్కరణతో తన అభిమానాన్ని చాటుకున్న ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్" అంటూ అందుకు సంబంధించి వీడియోను ఎక్స్‌లో పలువురు పోస్టు చేశారు. సీఎంపై అభిమానంతో మెట్టు సాయి ఇచ్చిన ఈ కానుక ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# కేటీఆర్ చుట్టూ బిగుసుకుంటున్న ఫార్ములా ఈ రేసు స్కాం

-మొదటిపేజీ తరువాయి

కేసులో ఏసీబీ దూకుడుగా దర్యాప్తు చేస్తోంది. ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వం కొరడా విసురుతోంది. రాష్ట్రంలో జరిగిన పలు స్కాములపై ప్రభుత్వం విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. కాళేశ్వరం ప్రాజెక్టు, ఫోన్ ట్యాపింగ్, విద్యుత్ కొనుగోళ్ల అంశం, లిక్కర్ పాలసీ కేసు ఇలా పలు అంశాలపై గత ప్రభుత్వం అవినీతి ఆరోపణలు ఎదురుకుంటోంది. వీటిలో లిక్కర్ పాలసీ కేసులో మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత కొన్ని నెలల పాటు జైలుకు సైతం వెళ్లి వచ్చారు. విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంలో అవినీతి జరిగినట్టు ఆరోపణలు రావడంతో కేసీఆర్ ను విచారణకు ఆహ్వానించినప్పటికీ ఆయన వెళ్లలేదు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై విచారణ జరుగుతుండగా గత ప్రభుత్వంలో పనిచేసి ఆరోపణలు ఎదురుకున్న అధికారి విదేశాల్లో ఉన్నారు. ఫార్ములా ఈ-రేసింగ్‌కు సంబంధించి రూ.55 కోట్లు విదేశీ సంస్థలకు అక్రమంగా చెల్లించినట్లు గుర్తించారు. మున్సిపల్ శాఖ వద్ద రికార్డుల ఆధారంగా విదేశీ సంస్థలు, ప్రతినిధులకు నోటీసులు ఇవ్వనున్నారు. ఫార్ములా ఈ-రేసింగ్ నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన గత ప్రభుత్వంలోని పెద్దలకు కూడా నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది. ఈ రేసు వ్యవహారం మొత్తం కేటీఆర్ కనుసన్నల్లో జరగడంతో ఆయనకే నోటీసులు ఇస్తారని అంటున్నారు. ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఫార్ములా ఈ రేస్‌లో చోటుచేసుకున్నఅక్రమాలపై విచారణకు అవినీతి నిరోధక శాఖకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ రేస్‌లో రూ.55 కోట్లు ఎలాంటి అనుమతులు లేకుండా తరలించారు. ఐఏఎస్‌లు సహా అప్పటి బీఆర్ఎస్ సర్కారు పెద్దల ప్రమేయం ఉండడంతో కేసు నమోదు చేయాలని నిర్ణయించారు. నుమతి కోరుతూ ఏసీబీ అధికారులు ప్రస్తుత ప్రభుత్వానికి లేఖ రాశారు. దీనిని పరిశీలించిన అనంతరం కేసు నమోదు చేసి విచారణ చేపట్టేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏసీబీ వెంటనే విచారణ ప్రారంభించింది. కేసుతో సంబంధం ఉన్నవారందరికీ విడివిడిగా నోటీసులు ఇచ్చి, విచారించి స్టేట్‌మెంట్లు రికార్డు చేయనున్నారు. ఐఏఎస్‌లు మొదలు కీలక అధికారులు, నాటి ప్రజాప్రతినిధుల దాక వీరిలో ఉండే అవకాశం ఉంది. స్టేట్‌మెంట్ ఆధారంగా గత ప్రభుత్వంలోని కీలక నేతలకు నోటీసులు జారీ చేసి ప్రశ్నించే అవకాశం ఉంది. ఫార్ములా ఈ రేస్‌కు సంబంధించి అప్పటి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు ఆదేశిస్తేనే విదేశీ సంస్థలకు నిధులు విడుదల చేశామని ఇప్పటికే అధికారులు వెల్లడించారు. మున్సిపల్ శాఖ ఉన్నతాధికారిగా పని చేసిన అర్వింద్ కుమార్ కేటీఆర్ నోటి మాట ద్వారా ఆదేశించడంతోనే నిధులు ఇచ్చామని అంటున్నారు. మున్సిపల్ శాఖ నుంచి నిధులు మాయమయ్యాయి. ఓ విదేశీ సంస్థకు వెళ్లాయి. ఆ విదేశీ సంస్థకు చెల్లించాల్సిన అవసరమే లేదు. చెల్లించేందుకు ఆర్థికశాఖ అనుమతి.. కేబినెట్ అనుమతి లేదు. పూర్తిగా ప్రజాధనం లెక్కల్లో లేకుండా పోయింది. ఇది పూర్తిగా నిధుల స్వాహా అనే అభిప్రాయం కల్పిస్తుంది. అందుకే ఏసీబీ కేసు నమోదు చేసింది. సీరియస్ నేరం కావడం పక్కాగా సాక్ష్యాలు ఉండటంతో విచారణకు పిలిచి అరెస్టులు చేసే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు.

# కామన్‌వెల్త్ గేమ్స్ అనగానే కాంగ్రెస్ కుంభకోణం గుర్తుకొస్తది

**హైదరాబాద్ :** కామన్‌వెల్త్ గేమ్స్ అనగానే కాంగ్రెస్ కుంభకోణం గుర్తుకు వస్తదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ కామన్‌వెల్త్ కుంభకోణంలో సురేశ్ కల్మాడి జైలుకు కూడా వెళ్లాడని కేటీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

ఈ మోటార్ కార్ల రేసింగ్ అనేది ఒక క్రీడ. కబడ్డీ, ఖోఖో, క్రికెట్ లాగే మోటార్ రేసింగ్ కూడా ప్రపంచ వ్యాప్తంగా ప్రజాదరణ పొందిన క్రీడ. ప్రపంచంలోనే తొలిసారిగా 1894లో కార్ల రేసింగ్ పారిస్‌లో జరిగింది. ఫార్ములా -1 మొదటి రేస్ 1946లో తొలిసారిగా ఇటలీ దేశంలో జరిగింది. ఎఫ్-1 రేస్‌ను ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిరు. ఈ రేస్ నిర్వహణ కోసం ప్రపంచ దేశాలు పోటీ పడుతాయి. దేశానికి ఫార్ములా -1 రావాలనే కల ఈనాటిది కాదు. రేవంత్ రెడ్డి గురువు చంద్రబాబు నాయుడు 28 సెప్టెంబర్ 2003లో అప్పటి ఎఫ్-1 సీఈవోను కలిసి మా రంగారెడ్డి జిల్లాలో పెట్టాలని కోరారు. రేవంత్ రెడ్డి గురువు కన్నకలను మేం నెరవేర్చాం. శిష్యుడు మాత్రం నెరవేర్చలేదు. చంద్రబాబు దాంతో ఆగలేదు. ఎఫ్-1 కండక్ట్ చేయడానికి గోపన్‌పల్లి ప్రాంతంలో 1500 ఎకరాలు సేకరించాలని నిర్ణయించారు. చివరకు 400 ఎకరాలకు నోటిఫికేషన్ ఇచ్చి డెడికేటెడ్ ట్రాక్ నిర్మించాలని చంద్రబాబు నిర్ణయించారు. ఆ 400 ఎకరాల్లో కూడా రేవంత్ రెడ్డి భూమి ఉంది. భూసేకరణకు కూడా నోటిఫికేషన్ ఇచ్చారు. మేం భూములు ఇవ్వమని రైతులు కోర్టుకు వెళ్లారు. ఆ కేసు ఇంకా నడుస్తోందని కేటీఆర్ తెలిపారు. ఫార్ములా -1 రేష్ నిర్వహణ కోసం నాటి సీఎం చంద్రబాబు చొరవ తీసుకుని ఇటలీ వెళ్లి అడిగారు. 2004లో ఓడిపోయారు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. యూపీఏ హయాంలో యూపీలో మాయావతి ప్రభుత్వం.. జేపీ(జయప్రకాశ్ గ్రూప్) గ్రూప్ వాళ్లతో ప్రమోట్ చేసి.. ఎఫ్-1ను ఇండియాకు తీసుకొచ్చారు.



2011, 2012, 2013లో నోయిడాలో జేపీ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్మించిన ట్రాక్ పై ఎఫ్-1 రేస్ జరిగింది. 1984లో ఏషియన్ గేమ్స్, ఆ తర్వాత కామన్‌వెల్త్ గేమ్స్ మన దేశ రాజధాని ఢిల్లీలో జరిగాయి. కామన్ వెల్త్ గేమ్స్ కండక్ట్ చేయడానికి 70,608 కోట్లు ఖర్చు చేయడం జరిగింది నాటి కాంగ్రెస్ ప్రభుత్వం. ఇంకో ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే ఒరిజినల్ ఎస్టిమేట్ కంటే.. 114 రెట్లు ఎక్కువ. ఈ కామన్‌వెల్త్ కుంభకోణంలో సురేశ్ కల్మాడి జైలుకు వెళ్లాడని కేటీఆర్ గుర్తు చేశారు. 2013 అక్టోబర్ 24 నుంచి నవంబర్ 1 వరకు ఉమ్మడి ఏపీలో సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ఆఫ్రో ఏషియన్ గేమ్స్ నిర్వహించారు. దీని ఖర్చు 103 కోట్లు. ఒక క్రీడల కోసం ప్రభుత్వాలు ఖర్చు పెట్టడం పరిపాటి. కామన్ వెల్త్ గేమ్స్ యూపీఏ ప్రభుత్వం నిర్వహించింది. నోయిడాలో 2010-11లో ఎఫ్-1 ఖర్చు 1700 కోట్లు. తమిళనాడులో ఫార్ములా -4 రేస్ జరిగింది నాలుగు నెలల క్రితం. ఆ రాష్ట్ర ప్రభుత్వం 42 కోట్లు ఖర్చు పెట్టిందని కేటీఆర్ తెలిపారు.

**మెగా కృష్ణారెడ్డి ఇంటి మీదకు ఏసీబీని పంపే దమ్ముందా..? రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్**

మెగా కృష్ణారెడ్డి ఇంటి మీదకు ఏసీబీని పంపే దమ్ముందా..? అని సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. నీవు మొగోనివే అయితే మెగా కృష్ణారెడ్డి కంపెనీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. నన్ను ఏసీబీ విచారిస్తుందట.. ఏసీబీ ఫుల్ పామ్ తెలుసా రేవంత్ రెడ్డికి.. తెలుసనుకో.. బ్యాగులతో తిరిగినోడికి ఎందుకు తెల్వదు. ఏసీబీ అంటే యాంటీ కరప్షన్ బ్యూరో. ఏసీబీని కరప్షన్‌కు వ్యతిరేకంగా వాడాలి. ఇందులో కరప్షన్ ఏడుంది.. కాకరకాయ ఏడుంది. నేను అడుగుతున్నా చెప్పు. ఫార్ములా-ఈ రేస్ హైదరాబాద్‌లో ఉండాలని చెప్పి హెచ్ఎండీఏ నుంచి రూ. 55 కోట్లు పంపిన మాట వాస్తవం. దాంట్ల నేను ఏమైనా దాచుకుంటినా..? నాకు ఏమైనా వచ్చాయ..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ రేస్ రద్దుతో హైదరాబాద్‌కు నష్టం కలిగించినా రేవంత్ రెడ్డి మీద కేసు పెట్టాలి. హైదరాబాద్ ఇమేజ్ దెబ్బ తీశావు. రేవంత్ రెడ్డిది తెలివితక్కువ నిర్ణయం. ఆగస్టు 25న నరికిండు రేవంత్ రెడ్డి.. 2036 ఒలిపింక్స్‌ను ఇక్కడికి తెస్తడట. ఎంత ఖర్చు అయితదో తెలుసా ఈ సీఎంకు. 2016 ఒలిపింక్స్‌కు రియోలో లక్షా 8 వేల కోట్లు, 2020లో టోక్యోలో 2.9 లక్షల కోట్లు ఖర్చు పెట్టారు. ఈ ఖర్చు మన బడ్జెట్ అంత. ఈ మొగోడు ఒలింపిక్స్ హైదరాబాద్‌లో పెడుతాడట. 50 కోట్లకే ఒర్రుతుండు. నీ ముఖానికి అయితదా..? అంతర్జాతీయ ప్రమాణాతో ఈవెంట్ నిర్వహించడం తెలుసా..? అని కేటీఆర్ నిప్పులు చెరిగారు. చేతనైతే మెగా ఇంజినీరింగ్ మీద పెట్టు కేసు. సుంకిశాలలో గోడ కూలిపోయింది 80 కోట్లు నష్టం వచ్చింది. దమ్ముంటే బ్లాక్ లిస్ట్‌లో పెట్టి మెగా కృష్ణారెడ్డి ఇంటి మీదికి ఏసీబీని పంపు.. ఈస్టిండియా కంపెనీ అన్నావు కదా..? నీవు మొగోనివి అయితే పంపు.. ఏసీబీ కేసు పెట్టు. అవసరమైతే 50 లక్షలతో దొరికిన బ్యాగ్‌మెన్ మీద ఏసీబీ కేసు పెట్టాలి. ఇవాళ రేస్ రద్దు చేయడం కారణంగా జరిగిన నష్టానికి రేవంత్ మీద ఏసీబీ కేసు పెట్టాలి. మేం బ్రాండ్ ఇమేజ్ క్రియేట్ చేశాం. మీరు బ్యాడ్ ఇమేజే క్రియేట్ చేస్తున్నాం. హైడ్రా పేరుతో విశ్వనగరం విజన్‌ను దెబ్బతీస్తున్నావ్ అని రేవంత్ రెడ్డిపై కేటీఆర్ మండిపడ్డారు.

## వాటిపై ఫోకస్ పెట్టిన హైడ్రా

-మొదటిపేజీ తరువాయి

ఉన్న కర్ణాటక స్టేట్ నాచురల్ డిజాస్టర్ మానిటరింగ్ సెంటర్‌ను హైడ్రా అధికారుల బృందం సందర్శించనుంది.

**బెంగళూరు పర్యటనలో హైడ్రా బృందం**

నేచురల్ డిజాస్టర్ మానిటరింగ్ సెంటర్ విపత్తు నిర్వహణపై సీనియర్ శాస్త్రవేత్తలతో సమావేశమవుతారు. అనంతరం అక్కడి నుంచి సెన్సార్ల సహాయంతో పర్యవేక్షిస్తున్న మురుగునీటి వ్యవస్థను పరిశీలిస్తారు. బెంగళూరు కోర్ సిటిలో ఉన్న చెరువులను సందర్శిస్తారు. రెండో రోజు పర్యటనలో 'లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా' ఆనంద్ మల్లిగవాడ్‌తో సమావేశం కానున్న రంగనాథ్ కర్ణాటక ట్యాంక్ కన్జర్వేషన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం 2014పై చర్చించనున్నారు.

**ఎలక్ట్రానిక్ సిటీ సమీపంలో చెరువుల సందర్శన**

అనంతరం ఎలక్ట్రానిక్ సిటీ సమీపంలోని మార్గందోన్హల్లీ చెరువు, ఇన్ఫోసిస్ సంస్థ అభివృద్ధి చేసిన చెరువులను సందర్శించి అక్కడ అమలు చేసిన ఉత్తమ విధానాలు, సాంకేతికతను తెలుసుకోనున్నారు. ఇటీవల ఈ విషయాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆనంద్ మల్లిగవాడ్ తో చర్చించిన రంగనాథ్ ప్రత్యక్షంగా వాటిని పరిశీలించడం ద్వారా హైదరాబాద్‌లో చేపట్టాల్సిన పునరుద్ధరణ చర్యలపై ఒక అంచనా ప్రకారం ప్రణాళికలు తయారు చేయనున్నారు. మరోవైపు ప్రభుత్వం కూడా నగరంలో ఐదు చెరువులను పునరుద్ధరించాలని ఆదేశించిన నేపథ్యంలో హైడ్రా ఆ దిశగా చర్యలను వేగవంతం చేసింది.

**నివాసాల మధ్య చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణ**

హైదరాబాద్‌లోని చెరువుల పునరుద్ధరణపై దృష్టి కేంద్రీకరించిన హైడ్రా ఇప్పటికే పలుచోట్ల ఆక్రమణలను తొలగించింది. కొద్ది రోజుల క్రితమే మరో కీలక నిర్ణయం కూడా తీసుకుంది. నివాసాల మధ్య ఉన్న చెరువుల ఎఫ్?టీఎల్?ను నిర్ధారించి వాటి పునరుద్ధరణ కోసం కృషి చేస్తున్నట్లుగా హైడ్రా కమిషనర్? రంగనాథ్ వెల్లడించారు. ఇందులో బాగంగానే ఔటర్? రింగ్?రోడ్? దగ్గరలోని ఖాజాగూడ వద్ద ఉన్న తౌటోని కుంటను కమిషనర్? సందర్శించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులతో సమీక్షించారు.

## కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలు దివాలా తీశాయి



కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలు ఆర్థికంగా దివాలా తీశాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పాలనపై 11 నెలల్లోనే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తోందన్నారు. సికింద్రాబాద్‌లో జరిగిన సంస్థాగత ఎన్నికల ప్రక్రియ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ... బీజేపీకి సంస్థాగత ఎన్నికల వ్యవస్థ ఊపిరి అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మహిళలు, యువత, రైతుల సమస్యలపై బీజేపీ పోరాటం చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. తెలంగాణ ప్రజల పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడినట్లయిందన్నారు. ఏడాది పాలన పూర్తి కావొస్తున్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీని నెరవేర్చలేదని విమర్శించారు. ఓ వైపు సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసుకుంటూ మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలపై పోరాడాలన్నారు. దేశంలో జమ్మూకశ్మీర్ నుంచి తమిళనాడు వరకు దాదాపు అన్ని పార్టీల్లోనూ కుటుంబ పాలన సాగుతోందన్నారు. కానీ బీజేపీలో మాత్రం కార్యకర్తల నుంచి ఉన్నతస్థాయి వరకు పదవులు దక్కుతాయన్నారు. కేసీఆర్ హయాంలో రూ.7 లక్షల కోట్లు అప్పులు అయితే... కాంగ్రెస్ పాలనలోనూ అదే కొనసాగుతోందని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయం బీజేపీ మాత్రమేనని ప్రజలు లోక్ సభ ఎన్నికల్లో తీర్పును ఇచ్చారని వెల్లడించారు.

## నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి



అందరికి విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అందుకే డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచినట్లు చెప్పారు. 21వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించినట్లు తెలిపారు. 11,062 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసినట్లు తెలిపారు. దేశ నిర్మాణంలో విద్యార్థులు కూడా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం అందించేందుకు ప్రభుత్వం కుల గణన సర్వే నిర్వహిస్తోందిన్నారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రతీ నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. వచ్చే అకడమిక్ ఇయర్ లోగా నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిపారు. చదువుతో పాటు స్కిల్ ఉంటేనే ఉద్యోగాలు లభిస్తాయిని, అందుకే విద్యార్థి, నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. టాటా ఇనిస్టిట్యూట్ సహకారంతో ఐటీఐలను ఏటీసీలుగా మారుస్తున్నట్లు వెల్లడించారు. సాంకేతిక నైపుణ్యంతో పాటు ప్రభుత్వం ఉద్యోగ భద్రతను కల్పిస్తోందన్నారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని, విద్యార్థులు క్రీడల్లో రాణించాలని వారిని ప్రోత్సహించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. వచ్చే ఒలింపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు.

## ముందుకు సాగని రైతు కమిషన్

-మొదటిపేజీ తరువాయి

మాత్రం అశ్రద్ధ వహిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.బీఆర్కే భవన్‌లో కమిషన్ ఏర్పాటైంది కానీ, సరైన సౌకర్యాలు చేయలేదు సంబంధిత అధికారులు. కనీస వసతులు, కావాల్సిన సిబ్బంది లేక ఇబ్బంది పడుతున్నారు సభ్యులు. చాంబర్లు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు ఉన్నతాధికారులు. ప్రస్తుతం చైర్మన్ కోదండ రెడ్డి కోసం ఒక చాంబర్ ఏర్పాటు చేయగా, అందులో వాష్ రూమ్‌కు డోర్ లేని పరిస్థితి. ఎవరైనా వాష్ రూమ్‌కు వెళ్లాలంటే మరొకరు దగ్గరలో నిలబడాల్సి వస్తోంది. వచ్చిన గెస్టులు దీన్ని చూసి షాక్ అవుతున్నారు. ఈ పరిస్థితి చూసి బాధ్యతలు తీసుకోడానికి సభ్యులు వెనుకాడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యానికి ఇది నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తోంది.బాధ్యతలు తీసుకున్న మెంబర్లు చాంబర్ల లేక చైర్మన్ రూమ్‌లోనే కూర్చుంటున్నారు. ఈ పరిస్థితి చూసి రాములు నాయక్ తనకు పదవి వద్దని అంటున్నట్టు సమాచారం. ఓవరాల్‌గా ఈ వ్యవహారం చూశాక, అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతుల కోసం ఈ కమిషన్‌ను ఏర్పాటు చేస్తే, కిందిస్థాయిలో అధికారులు నీరుగార్చే ప్రయత్నంలో ఉన్నారు. దీనికి ప్రధాన కారణం, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్‌కు కమిషన్ ఏర్పాటు ఇష్టం లేదనే టాక్ వినిపిస్తోంది. అందుకే, కమిషన్ ఏర్పాటుపై జీవో ఇవ్వడానికి ఈయన మొదట్లో ఆలస్యం చేశారని అనుకుంటున్నారు.రాష్ట్రంలో రైతు సంక్షేమం కోసం నిర్ణయాలు తీసుకుంటోంది ప్రజా ప్రభుత్వం. ఇప్పటికే రుణమాఫీ అందించి ఎన్నో కుటుంబాల్లో సంతోషాన్ని నింపింది. వారి అవసరాల కోసం ప్రభుత్వం రైతు కమిషన్‌ను ఏర్పాటు చేస్తే, అధికారులు మాత్రం దీన్ని పెత్తనంగా భావిస్తున్నారు. అందుకే, పైసా కూడా వ్యవసాయ శాఖ నుండి విడుదల కావడం లేదట. దీంతో సొంత ఖర్చులతోనే టీ, స్నాక్స్ తెప్పించుకుంటున్నారు సభ్యులు. అంతేకాదు, సొంత మనుషులనే సిబ్బందిగా వాడుకుంటున్నారట. ఈ ఇష్యూని సీఎం దృష్టికి తీసుకెళ్లే పనిలో కమిషన్ చైర్మన్, సభ్యులు ఉన్నారురైతు కమిషన్‌పై సీఎం రేంత్ రెడ్డి ఎంతో కృతనిశ్చయంతో ఉన్నారు. రైతుల పట్ల ఉన్న ప్రేమతో దీన్ని ఏర్పాటు చేశారు. కానీ, వ్యవసాయ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా వారిలో మార్పు రావాలి. నిజానిజాలు బయటకు తీసుకొస్తుంది. జాగ్రత్త ఆఫీసర్స్.

# నిర్లక్ష్యం నీడలో అధికారుల పనితీరు

**జిల్లా పాలానాధికారి ఆకస్మిక తనిఖీలు...**
**ప్రత్యేక సమిక్షలు సమావేశాలతో 24/7 కష్టపడుతున్నా**
**అన్ని శాఖల్లో ఇంకా వీడని బద్ధకం...నిర్లక్ష్యం**
**మంత్రి ఇలాకాలో కూడా అధికారుల తీరు మారదాయే**

**పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లా కలెక్టర్ గా కోయ శ్రీహర్ష బాధ్యతలు చేపట్టిన నాటి నుండి 24/7 విధులు నిర్వర్తిస్తూనే వున్నారు. అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేస్తూ, సమిక్షలు, సమావేశాలు, ఆకస్మిక తనిఖీలతో జిల్లాను జల్లెడ పడుతున్నారు. మండలం స్థాయి అధికారులకు హెచ్చరికలు జారీ చేస్తూనే... విధుల్లో బాధ్యతలు లేని వారికి మెమోలు, సరెండర్లు, సస్పెండ్ లు చేస్తూనే ఉన్నారు. అర్ధరాత్రి సైతం లెక్క చేయకుండా ఆకస్మికంగా తనిఖీలు చేస్తూ తన ఉద్యోగానికి న్యాయం చేస్తూనే ఉన్నారు. ఇంత జరుగుతున్నా అధికారుల్లో మాత్రం వారి విధులు నిర్వహించడంలో చిత్తశుద్ధి కానరావడం లేదు కదా తోటి అధికారిని చూసి మారుదామనే ఆలోచన లేదు. సమయానికి జీతం డబ్బులు వస్తే సరిపోతుంది అనుకునే అధికారులు వున్నంతవరకు ఈ వ్యవస్థలో మార్పు రాదనే చెప్పాలేమో. ఈ నిర్లక్ష్యం ఖరీదు విద్యార్థుల ప్రాణం మీద కు వచ్చిన సంఘటన పెద్దపల్లి జిల్లాలోని ముత్తారం మండలం లోని కేజీబీవి హాస్టల్ లో జరిగింది. పర్యావరణ సంబంధిత సమస్యలా లేక ఆహారం కల్తీ తెలియని సందిగ్ధం. మొత్తానికి విద్యార్థులు కోలుకోవడం ఆనందమే అయినా జరిగిన పరిణామానికి ఎవరు బాధ్యత వహిస్తారు. మళ్ళీ తల్లితండ్రులు పాఠశాలకు పంపాలంటే ఎన్నో భయాలు. హాస్టల్ పక్కనే ఉన్న డంపు యార్డు మూలంగా సమస్య వచ్చిందా మరే ఇతర కారణం ఏదైనా కూడా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఇక జిల్లా కేంద్రం మొదలు కొని మండలం, గ్రామ స్థాయి అధికారుల్లో విధుల నిర్వహణలో అశ్రద్ధ, బాధ్యత లేని తనం కనిపిస్తూనే ఉంటున్నాయి. వైద్య, విద్య, రెవెన్యూతోపాటు ప్రతి శాఖలో అవినీతి ప్రధాన సమస్యగా మారింది. దీనికి తోడు సమయ



పాలన లోపం. అధికారులు కార్యాలయాలకు ఎప్పుడు వస్తున్నారో... ఎప్పుడు వెళుతున్నారో తెలియని వైనం. అందులో పని చేసే అధికారికి క్రింద స్థాయి అధికారుల విషయమే పట్టింపు లేదు. తూతు మంత్రంగా డ్యూటీలు... మళ్ళీ బయట దందాలు... ఈ వ్యవహారం ముఖ్యంగా వైద్య, విద్యా శాఖలో ఎక్కువగా కనిపిస్తున్నది. ప్రభుత్వ వైద్యులు ప్రైవేట్ ఆసుపత్రి నడప రాదనే నిబంధనలను వారు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. బయట ప్రైవేట్ ఆసుపత్రి పెట్టి మరో డాక్టర్ తో మ్యానేజ్ చేస్తున్నారు. ఇక్కడి రోగులు అక్కడికి తరలించుకు పోవడంలో తెలివిని ఉపయోగిస్తూ తప్పించుకుంటున్నారు. ఇక విద్యా వ్యవస్థలో అధికారులు, ఉపాధ్యాయులు చాలా మంది రియల్, చైన్ మార్కెటింగ్ దందాలు విధుల సమయంలోనే చక్క బెడుతున్నారు. జిల్లాలోని పలు శాఖల్లో అధికారుల విదుల కోసం ప్రభుత్వం వారికి అద్దె ప్రతిపాదికన వాహనాలు కేటాయించారు. కానీ వారు వారి స్వంత వాహనాలు పెట్టుకోని దొంగ బిల్లు పెట్టి మోసాలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కారు అసోసియేషన్ తరుపున ఓ జిల్లా అధికారిని సంప్రదిస్తే స్పందించక పోగా, వారిపై దురుసుగా మాట్లాడినట్లు సమాచారం. ఇంకా రెవెన్యూ, రవాణా శాఖ, సబ్ రిజిస్టర్, అబ్కారీ శాఖల్లో అయితే పట్ట పగ్గాల్లేని అవినీతి జరుగుతుందనడంలో అతిశయోక్తి లేదేమో. కిరాణా షాపుల్లోనే బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నా, నిత్యం అటు గుండా వెల్లే అధికారులు చూసి చూడనట్లు ఉండే వైనం. రౌతు సక్రమంగా ఉన్నా, పని చేయని దొంగ గుర్రాలతో పని చేయించడం కష్టమేననే భావన పలువురిలో వ్యక్తమవుతున్నది. జిల్లా కేంద్రంలోనే ఇలాంటి అధికారులు ఉంటే ఇక మండలం, గ్రామ స్థాయిల్లో చెప్పనలవి కానీ బాధలు. ఇటీవల మత్స్య శాఖలో కూడా చేప పిల్లల పంపిణి వ్యవహారంలో పలు అవినీతి ఆరోపణలు బలంగా వినిపించాయి. నిజాయితీగా పని చేసే అధికారులు లేకుండా పోతున్నారనే ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. కాగా ఇటీవల విధుల నిర్వహణలో అశ్రద్ధ చూపుతున్న పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్
ఉత్తర్వులు జారీ చేశారు. ఇక పోలీస్ శాఖలో అయితే ఆపరేషన్ గరుడ పేరుతో ఎన్ని విజయాలు సాధించారో వారికే తెలియాలి. గతంలో మాదిరిగా కాకుండా ఇప్పుడు ఎక్కువ శాతం పోలీస్ వ్యవస్థ సీసీ కెమెరాల జపంతోనే కాలం గడిచి పోతున్నది. జిల్లా కేంద్రంతో పాటు చుట్టు పక్కల మండల కేంద్రాలు పదుల సంఖ్యలో పోలీస్ ఠాణాలు ఉన్నా దొంగలను పట్టుకునే స్థాయిలో లేకపోవడం శోచనీయని పలువురు బహిరంగానే పేర్కొంటున్నారు. గడిచిన ఎనిమిది నెలల కాలంలో జిల్లా కేంద్రంలో పలు దొంగతనాలు జరిగినా వాటి చేదనలో ఇంకా మీనమెషాలే నడుస్తున్నాయి. సివిల్ కేసుల్లో ఉత్సాహం చూపే పోలీసులు, ప్రజా సమస్యల పరిష్కారంలో తేలిపోతున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంత చెప్పినా తక్కువే అవుతున్నది.

రాష్ట్ర మంత్రి కేంద్రంగా ఉన్న జిల్లాలో కూడా నిర్లక్ష్యమేనా ...
రాష్ట్ర మంత్రిగా దుద్దిల్ల శ్రీధర్ బాబు జిల్లా కేంద్రంలోని మంథని నియోజకవర్గానికి చెందిన వ్యక్తి అయినా అధికారులకు భయం, భక్తి లేకుండా పోతున్నది. విధులు నిర్వహణలో అదే నిర్లక్ష్యం. సమయ పాలన లేదు. స్థానికంగాఉండరు. ఇలాంటి వారికి కొంతమంది ఉన్నతాధికారులు వంత పాడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏది ఏమైనా అధికారులు మారితే గాని వ్యవస్థలో మార్పు రాదనే భావన ప్రజలల్లో బలంగా నాటుకు పోయింది.

# ఆగని ధాన్యం కొనుగోళ్ల రచ్చ

**నిజామాబాద్ :** తెలంగాణలో ధాన్యం కొనుగోళ్ల రచ్చ నడుస్తోంది. కొంటున్నామని ప్రభుత్వం.. రైతులు ప్రైవేటుకు అమ్ముకుంటున్నారని ప్రతిపక్షం మాటకు మాటతో డైలాగ్‌వార్‌కు దిగుతున్నాయి. వాస్తవానికి ధాన్యం కొనుగోళ్లు మాత్రం ఆలస్యం అవుతున్నాయి. ఇప్పటికే సగానికిపైగా వడ్లు ప్రైవేటుకు అమ్ముకున్నారు రైతులు. సెంటర్లు ఏర్పాటు చేశారే కానీ ఎక్కడా సరిగ్గా కొనుగోళ్లు జరగడం లేదు. దీనికి ప్రధాన కారణం మిల్లర్లు ధాన్యం తీసుకోవడానికి ముందుకు రావడం లేదట. మిల్లర్లు చేతులెత్తేయడానికి ప్రభుత్వ పాలసీనే ప్రధాన కారణమంటున్నారు. ఈసారి ధాన్యం తీసుకోవడానికి మిల్లర్లకు బ్యాంకు గ్యారెంటీ స్కీమ్ పెట్టింది ప్రభుత్వం. మిల్లర్లు 5 నుంచి 20 శాతం వరకు బ్యాంకు గ్యారెంటీని ఇవ్వాలని చెప్పింది. ఏదో విధంగా బ్యాంకు గ్యారెంటీ ఇద్దామనుకున్నా.. మరో కండిషన్‌కు మాత్రం మిల్లర్లు ఒప్పుకోవడం లేదు. సన్నధాన్యం కూడా కేంద్రం రూపొందించినట్లు అఔఖీ అంటే కస్టమ్ మిల్లింగ్ రైస్ ఇవ్వాల్సిందేనని రూల్ పెట్టింది. క్వింటాల్ ధాన్యానికి అఔఖీ కింద 67 కేజీల బియ్యం ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఈ స్కీమ్ దొడ్డు వడ్లకు కుదురుతుంది కానీ.. సన్న వడ్లకు వర్కౌట్ కాదని మిల్లర్లు చేతులెత్తేస్తున్నారు. తెలంగాణ సర్కారు చెప్పినట్లు సన్న వడ్లు తీసుకుంటే.. క్వింటాల్‌కు 58 నుంచి 60 కేజీల బియ్యం మాత్రమే ఇస్తామంటున్నారు మిల్లర్లు.సీఎంఆర్ విషయంలో ప్రభుత్వం ససేమిరా అంటోంది. మిల్లర్లు మాత్రం సీఎంఆర్ ఇవ్వాలంటే క్వింటాల్‌కు 300 రూపాయల బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే రైస్ మిల్లింగ్ వ్యవస్థ కుప్పకూలుతుందని వాపోతున్నారు. ఈ విషయం కొలిక్కి రాక.. ధాన్యం కొనుగోళ్లు పరిస్థితి గందరగోళంగా మారింది. దీనంతటికి సివిల్ సప్లై కమిషనర్ డీఎస్ చౌహానే కారణమనే చర్చ జరుగుతోంది. ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రతీ ఏటా విడుదల



చేసే విధివిధానాలను కూడా ఈసారి చాలా ఆలస్యంగా రిలీజ్ చేశారు.ప్రతీ ఏడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్ మొదటి వారంలోనే గైడ్‌లైన్స్ ప్రకటిస్తారు. కానీ ఈసారి అక్టోబర్ 28న విధివిధానాలను విడుదల చేశారు. దీనికి తోడు ఈసారి ప్రకటించిన కండీషన్స్‌తో మిల్లర్లు ధాన్యం తీసుకోవడానికి ససేమిరా అంటున్నారు. ఇప్పటి వరకు సన్న ధాన్యం కొనుగోలు చేయకపోవడానికి కమిషనర్ విడుదల చేసిన కండీషన్సే ప్రధాన కారణమమనే చర్చ జరుగుతోంది. ప్రభుత్వం కూడా పూర్తిగా కమిషనర్ డీఎస్ చౌహాన్ మీదనే డిపెండ్ అవుతోందని..అందుకే గ్రౌండ్ రియాలిటీని అంచనా వేయలేకపోతోందన్న టాక్ వినిపిస్తోంది.ధాన్యం కొనుగోళ్ల విషయంలో పరిస్థితి చేయి దాటిపోతుండటంతో సీఎం రేవంత్ రెడ్డి రంగంలోకి దిగారు. ఉమ్మడి జిల్లాకు స్పెషల్ ఆఫీసర్లను నియమించారు. కానీ ఇప్పటి వరకు మిల్లర్లు ప్రస్తావిస్తున్న సన్న ధాన్యం మిల్లింగ్ విషయంలో స్పష్టత రావడం లేదు. దాంతో కొనుగోళ్ల ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఇప్పటి వరకు కేవలం 40వేల టన్నులకు మించి ధాన్యం సేకరించలేదు. ప్రభుత్వం మాత్రం ఈసారి 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిస్తామని చెబుతోంది. పరిస్థితి ఇలానే ఉంటే.. 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కూడా సేకరించే పరిస్థితి ఉండదు. దీంతో ప్రభుత్వం చెప్పినట్లుగా రేషన్ కార్డుల మీద సన్న బియ్యం సప్లై కూడా కష్టమే అవుతుంది.

# హైదరాబాద్‌లో ఠాగూర్ ట్రీట్మెంట్

**హైదరాబాద్ :** ఠాగూర్ సినిమాను ఎవరూ మరిచిపోరు. చనిపోయిన శవానికి ఎన్ని డబ్బులైనా ఇస్తాం బతికించుమంటే కార్పొరేట్ ఆస్పత్రి చేసిన నిర్వాకాన్ని మన చిరంజీవి కళ్లకు కట్టినట్టు చూపించాడు. ఇప్పుడే అదే సీన్ హైదరాబాద్ లో రిపీట్ అయ్యింది సినిమాను ఎవరూ మరిచిపోరు. చనిపోయిన శవానికి ఎన్ని డబ్బులైనా ఇస్తాం బతికించుమంటే కార్పొరేట్ ఆస్పత్రి చేసిన నిర్వాకాన్ని మన చిరంజీవి కళ్లకు కట్టినట్టు చూపించాడు. ఇప్పుడే అదే సీన్ హైదరాబాద్ లో రిపీట్ అయ్యింది. జూనియర్ వైద్యురాలి ప్రాణం తీసింది. ఆమె తరుపు వారు డబ్బులు కట్టకుంటే చికిత్స ఆపేసి అనంతరం చనిపోయినా కూడా బతికి ఉందని నాటకమాడి లక్షలు గుంజేసిన ఓ ఆస్పత్రి దారుణం వెలుగుచూసింది. పైసలు పీక్కుతునే ఈ కార్పొరేట్ ఆస్పత్రుల ఆగడాలు మరోసారి ఓ కుటుంబాన్ని చిదిమేశాయి.శవాలతోనూ పైసలు సంపాదించడం అంటే ఇదేనేమో. ఓ వైపు బిడ్డను కోల్పోయి పుట్టెడు దు:ఖంలో ఉన్న ఆ కుటుంబ పరిస్థితిని చూసి జాలి చూపాల్సింది పోయి.. మిగిలిన డబ్బు కట్టి శవాన్ని తీసుకువెళ్లండని చెప్పడం ఆందోళనకు దారితీసింది. హైదరాబాద్ హైటెక్ సిటీ పరిధిలో ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. ఆసుపత్రి నిర్వాకంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్పొరేట్ ఆసుపత్రుల్లో పరిస్థితులను మరోసారి ఈ ఘటన చాటిచెప్పింది. అనారోగ్యానికి గురైన జూనియర్ డాక్టర్ నాగప్రియను ఆమె కుటుంబసభ్యులు హాస్పిటల్‌లో



చేర్పించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ ఆమె మృతిచెందింది. అప్పటికే ఆమెకు ట్రీట్మెంట్ కోసం ఫ్యామిలీ మెంబర్స్ రూ.3 లక్షల వరకు ఖర్చు చేశారు. ఇంకా రూ.4 లక్షలు బిల్లు పెండింగ్‌లో ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. దీంతో ఆ డబ్బులు కట్టిన తరువాతనే డెడ్ బాడీ ఇస్తామని ఆస్పత్రి వర్గాలు చెప్పాయి. దీంతో బాధితులు ఎమ్మెల్యే గాంధీతో చెప్పించారు. అయినప్పటికీ ఆస్పత్రి యాజమాన్యం వినిపించుకోలేదు.అయితే.. ముందు రోజు అర్ధరాత్రి ఫోన్ చేసి రూ.మూడు లక్షలు కట్టాలని, లేదంటే ట్రీట్మెంట్ నిలిపివేస్తామంటూ ఆస్పత్రివర్గాలు నాగప్రియ కుటుంబసభ్యులకు ఫోన్ చేసి తెలిపాయి. ఉదయాన్నే వారు అలా ఇలా సమకూర్చి మరో లక్ష పే చేశారు. కానీ.. ఆ తరువాత నాగప్రియ చనిపోయింది. మిగతా డబ్బు అంటూ ఆస్పత్రి వర్గాలు బెట్టు వీడలేదు. ఆ డబ్బులు చెల్లించాకనే శవాన్ని ఇస్తామని ఖరాఖండిగా చెప్పారు. అయితే.. తమ కూతురికి వైద్యం చేయడం ఆపేయడం వల్లనే చనిపోయిందని కుటుంబసభ్యులు, బంధువులు ఆరోపించారు. దీంతో ఆస్పత్రి పరిసరాల్లో టెన్షన్ వాతావరణం నెలకొంది.

## యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి




**కమాన్ పూర్ :** యువత విద్యార్థులు చెడు అలవాటులకు దూరంగా ఉండాలని షీ టీం ఇన్చార్జి స్నేహలత అన్నారు.గురువారం రామగుండం సి.పి ఆదేశాల మేరకు, పాలకుర్తి మండలం లోని కుక్కలాగూడూరు జడ్పీఎస్ఎస్ హై స్కూల్ విద్యార్థలకు షీ టీం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. అందులో భాగంగా షీ టీం మెంబర్ స్నేహలత మాట్లాడుతూ మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు ఆంటీ డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందని , ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు ,లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు. మరియు ఆకతాయిల నుండి ఎలా రక్షణగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షి టీం సభ్యుడు సురేష్ మరియు ఇంచార్జ్ హెడ్ మాస్టర్ సురేందర్ , ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

## పలు హోటళ్లలో తనిఖీలు..నోటీసుల జారీ



**హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ లోని హోటల్స్, రెస్టారెంట్స్ పై జీహెచ్ఎంసి ఫుడ్ సేఫ్టీ అధికారుల నాన్ స్టాప్ దాడులు నిర్వహించారు. మూసాపేట్ కృతుంగ రెస్టారెంట్ లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు చేసారు. కిచెన్ లో ఎలుకలు, బొద్దింకలు ఉన్నట్లు గుర్తించారు. కిచెన్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని నిర్ధారించారు. కుళ్లిన చికెన్ ను కృతుంగ హోటల్ నిర్వాహకులు. రోజుల తరబడి ఫ్రిజ్ లో నిల్వ ఉంచారు.ష మరోవైపు, ఓల్డ్ సిటీ సంతోష్ నగర్ లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. శ్రీ రాఘవేంద్ర, ఉడిపి, సంతోష్ డాబా రెస్టారెంట్లపై ఫుడ్ సేఫ్టీ దాడులు జరిపారు. హోటల్స్ కిచెన్ లో బొద్దింకలు గుర్తించారు. కాలం చెల్లిన ఆహార పదార్థాలు గుర్తించారు. కుళ్లిపోయిన కూరగాయలతో వంట చేస్తున్నారు. ఫంగస్ వచ్చిన అల్లం ను స్టోర్ రూమ్ లో గుర్తించారు. ఆహార పదార్థాల్లో మోతాదుకు మించి ఫుడ్ కలర్స్ వినియోగిస్తున్నారు. కిచెన్ లో అపరిశుభ్రమైన వాతావరణం వుంది. దాంతో హోటల్స్, రెస్టారెంట్ల నిర్వాహకులకు నోటీసులు ఇచ్చారు. ఆహార భద్రత విషయంలో జాగ్రత్తలు పాటించకపోతే క్రిమినల్ కేసులు పెడతామంటూ హెచ్చరించారు.

## భీమదేవరపల్లిలో మంత్రి పొన్నం పర్యటన

**హనుమకొండ :** హనుమకొండ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండలంలో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ లో ఇటీవల మరణించిన భీమదేవరపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు సామల లింగమూర్తి చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం సామల లింగమూర్తి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుల గణన ఇంటింటి కుటుంబ సర్వే పై ఎన్యుమరెటర్స్ వేస్తున్న స్టిక్కరింగ్ ను గట్ల నర్సింగపూర్ లో పరిశీలించారు. కుల గణన పై అధికారులకు సమగ్ర వివరాలు ఇవ్వాలని సమాచారం గోప్యత ఉంటుందని స్థానికులకు తెలిపారు. అనంతరం స్కూల్ కి వెళ్తున్న విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. గట్ల నర్సింగపూర్ లో కూరగాయలు అమ్మతున్న మహిళల తో ముచ్చటించారు. వ్యాపారాలు ఎలా సాగుతున్నాయని ఆరా తీశారు. గ్రామంలో పలు వీధుల్లో తిరుగుతూ ప్రజలతో ముచ్చటిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గాంధీ

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న ముఖ్యమంత్రి సహాయనిధికి సంబంధించి ప్రస్తుతం ఆసుపత్రుల్లో అవుతున్న బిల్లులకు ఇచ్చే ఆర్థిక సహాయాన్ని మరింత పెంచాలని కోరారు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ . ఈ సందర్భంగా నేడు తన క్యాంపు కార్యాలయంలో 67 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. పేద మధ్యతరగతి ప్రజలకు ఆసుపత్రిలో బిల్లులు కట్టలేని పరిస్థితిలో ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ ఆర్థిక సాయంని అందిస్తుందని దీనిలో భాగంగానే నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు ఎన్నో వందలాది కుటుంబాలను తమ ఆదుకున్నామని తెలిపారు. గతంలో ఉన్న బిల్లులకు అనుగుణంగానే ప్రస్తుతం ఆర్థిక సాయం అందిస్తుందని దానిని మరింత పెంచేలా కృషి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి త్వరలోనే కలిసి వినతి పత్రాన్ని అందజేస్తానని ఎమ్మెల్యే గాంధీ అన్నారు.

## దళిత ఎస్ఐ బలవణ్మరణానికి కారకులను శిక్షించాలి




**పెద్దపల్లి :** కొత్తగూడెం జిల్లా ఆశ్వారావుపేటలో పని చేసిన దళిత ఎస్ఐ శ్రీరాముల శ్రీను బలవన్మరణానికి కారకులను కఠినంగా శిక్షించాలని, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని న్యాయ పోరాట సంఘీభావ కమిటీ ప్రతినిధులు గురిమిల్ల రాజు, జిలుక శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం మాట్లాడుతూ ఎస్ఐ శ్రీనును పైఅధికారి కులం పేరుతో వేధించాడని ఆరోపించారు. అధికారి వేధింపులు పడలేక శ్రీను పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నం చేశానని ఇచ్చిన మరణ వాంగ్మూలం ప్రకారం సదరు అధికారిని ఎందుకు సస్పెండ్ చేయలేదని నిలదీశారు. నిందితులకు ఇచ్చిన ముందస్తు బెయిల్ రద్దు చేసి వెంటనే అరెస్టు చేయాలని, బాధిత కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని, మృతుడి భార్యకు గ్రూప్ వన్ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పోరిక ఉదయ్ సింగ్, చక్రవర్తి, ఆరేపల్లి క్రాంతి కిరణ్, మొగిలి, ఎర్ర మోహన్ కృష్ణ, బాధిత కుటుంబ సభ్యురాలు శంకరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

Printed , Publisher , Edited and Owned by Rathod Raju , Printed at Jai Bhavani Printing Press , H.No. 2-42, Village : Jamidi Mdl. Ichoda Dist. Adilabad., State Telangana , Pin code – 504 307 ( T.S.) ,
TITLE CODE : TELTEL02020EDITOR : RATHOD RAJU , Contact Numbers : 9908940762 , 8985614333 . Email : republichindustan.rh@gmail.com , www.republichindustan.in ,